ఓటర్ల లెక్క.. ఇక పక్కా

- నగర, రూరల్ నియోజకవర్గాల జాబితా వెల్లడి
- మహిళా ఓటర్లే అధికం


సమావేశంలో పాల్గొన్న బూత్ లెవెల్ అధికారులు, సిబ్బంది

సీటీఆర్ఐ: మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు ఓ ఆయుధం.. మనం మెచ్చే పాలకులను ఎన్నుకునేందుకు ఇదో సాధనం. అలాంటి ఓటర్ల నమోదు కార్యక్రమం విస్తృతంగా జరుగుతోంది. కొత్త, పాత ఓటర్లను కలిపి రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలో అధికారులు లెక్క తేల్చారు. 2024 జనవరికి 18 ఏళ్లు నిండిన వారిని కూడా ఈ జాబితాలో చేర్చారు. ప్రతి కళాశాలలో ప్రత్యేక శిబిరాల ద్వారా ఓటర్ల నమోదు చేశారు. దీనికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఓటు నమోదు ప్రక్రియను అర్బన్, రూరల్ పరిధిలో నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వరకూ నమోదైన వారి జాబితాలను ఇటీవల విడుదల చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ పరిధిలో 225 పోలింగ్ కేంద్రాలున్నాయి. మొత్తం 2,62840 మంది కొత్త, పాత ఓటర్లు నమోదై ఉన్నారు. ఇందులో పురుషులు 2,26,922 కాగా మహిళలు 1,35,852, ఇతరులు 66 మంది ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో మొత్తం 2,63,769 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,29,160 మంది, మహిళా ఓటర్లు 1,34,594, ఇతరులు 15 మంది నమోదయ్యారు.

ఓటర్లు	అర్బన్	రూరల్
పురుషులు	1,26,922	1,29,160
మహిళలు	1,35,852	1,34,594
ఇతరులు	66	15
పోలింగ్ కేంద్రాలు	225	263

ఎక్కువ వారే..

రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలోని ఓటర్లలో పురుషులు కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఓటుహక్కుపై ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అవగాహన కల్పించడంతో నమోదు చేయించుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ఈ ఏడాది ఎక్కువ మంది మహిళా ఓటర్లు నమోదు చేసుకోవడం విశేషం. కళాశాల స్థాయిలో అమ్మాయిలు అధిక శాతం ఓటు పొందారు.

నిరంతరాయంగా ప్రక్రియ

ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బూత్ లెవెల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమైందని, ఓటర్ల జాబితాలను అత్యంత శ్రద్ధతో తయారు చేయాలని ఉన్నతాధికారులు తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు.

వివరాలు సేకరించాలి



కొత్తగా ఓటు నమోదు చేసుకుంటున్న వారిలో 25 ఏళ్లు దాటిన వారుంటే పూర్తి వివరాలు సేకరించాలి. గతంలో వారు ఎక్కడ ఉండేవారనే తెలుసుకుని, అక్కడ ఓటు ఉందా లేదా అనేది పరిశీలించాలి. ఓటును జాబితా నుంచి తీసివేసేటప్పుడు నోటీసు ఇవ్వాలి. ఒకే డోర్ నంబర్ నుంచి ఎక్కువ నమోదై ఉంటే సదరు కేసులను ప్రత్యేకంగా తనిఖీ చేయాలి.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగరపాలక సంస్థ

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు



పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి. సూపర్‌వైజర్లు, సహాయ ఎలక్ట్రోరల్ నమోదు అధికారులు ఎప్పటికప్పుడు తమకు కేటాయించిన బూత్ లెవెల్ ఆఫీసర్ల పనితీరును పరిశీలించాలి. వారికి దిశానిర్దేశం చేయాలి. ఎటువంటి పొరపాట్లు జరిగినా సంబంధితులపై చర్యలు తీసుకుంటాం.

– ఎస్.తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలసిన అను


టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డితో ముద్దాల అను

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను) తి.తి.దే మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలసి ట్రేడ్ యూనియన్‌కు సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. 2024 ఎన్నికల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని అనుకు సుబ్బారెడ్డి సూచించారు.

నిరంతరాయంగా స్వర్ణాంధ్ర సేవలు


దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: దాతల సహకారంతో స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిరంతరాయంగా సేవలు అందిస్తుందని స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి, పుష్కర్ ఘాట్ వద్ద జరుగుతున్న స్వర్ణాంధ్ర ఉచిత అన్నదాన కార్యక్రమం శనివారంతో 1036వ రోజుకు చేరిందని అన్నారు. ఈ సందర్భంగా అవసరార్థులకు దాతల నుంచి సేకరించిన దుస్తులను వాల్ ఆఫ్ హ్యాపీనెస్ కార్యక్రమంలో భాగంగా అందించామన్నారు. ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహణకు సహకరిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుమారు వెయ్యి మందికి దుస్తులను అందించారు. దుస్తులు, ఇతర వస్తువులు ఇవ్వాలనుకునే వారు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సంప్రదించాలని రాంబాబు కోరారు. సంస్థ మేనేజర్ ఎద్దు హరికృష్ణ, శ్రీనివాస్ రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న జాషువా

ధవళేశ్వరం: గుడ్ సమిరటన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వితంతువులు, దివ్యాంగులకు దొలూరి శాంసన్ జాషువా నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. స్థానిక సున్నంబట్టీ వీధిలో శాంసన్ జాషువా నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పేదలకు సాయం చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రకాశంనగర్: పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో 12 గంటల ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ జయశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని అన్నారు. కో చైర్మన్ నరహరి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలన్నారు. సంఘ కార్యదర్శి అరుణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములవుదాం..

రాజానగరం: దేశాభివృద్ధిలో అంతా భాగస్వాములం అవుదామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శ్రీకృష్ణపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 'నా భూమి– నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. బ్రిటిష్ బానిసత్వం నుంచి దేశానికి విముక్తి కలిగించడంలో ఎందరో మహనీయులు చేసిన పోరాటాలు, చేసిన ప్రాణ త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అదే ఆ మహనీయులకు మనం అందించే ఘనమైన నివాళి అని అన్నారు. పుడమి తల్లిని కాపాడుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సువర్ణరాజు తదితరులు

సీటీఆర్ఐ: మాదిగలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏపీ ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సువర్ణరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎస్సీ వర్గీకరణ సాధనకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ కమిటీలు వేసి పోరాడతామన్నారు. అక్టోబర్‌లో మాదిగల మహాసభను విజయవాడలో లేకుంటే కడపలో నిర్వహిస్తామన్నారు. ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా మాదిగలు ఎస్సీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పాలిమేర కిరణ్, ఏపీ ఎంఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లవరపు వెంకటరావు, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ జాన్‌సుందర్‌రాజు, జిల్లా ఇన్‌చార్జి వీధిజాన్ పాల్గొన్నారు.

తమ్మన్నదొర సంస్మరణ సభ విజయవంతానికి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: బ్రిటిషు వారితో పోరాడిన తొలి గిరిజన వీరుడు కారం తమ్మన్నదొర సంస్మరణ సభను ఆయన స్వగ్రామం బందపల్లిలో 14న నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రచురించిన సావనీర్‌లో గిరిజన ప్రాంతం నుంచి స్వాతంత్ర్య సమరయోధులుగా కారం తమన్నదొర, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజులను గుర్తించారన్నారు. 1880 జూలై 28న బ్రిటిష్ వారితో జరిగిన పోరాటంలో తమన్న దొర చనిపోయారన్నారు. సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ, కార్యదర్శి గడుతూరి చిన్నారావు, బందపల్లి ఎంపీటీసీ ముచ్చిక సాయిబాబు దొర, సత్యవేణి, అడ్వకేట్ చిలకపాటి సత్యానందం కోరారు.

కోవిడ్ అనంతర సమస్యలపై దృష్టి పెట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్


స్టాల్స్‌లో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: కోవిడ్ అనంతరం ఎదురవుతున్న అనారోగ్య సమస్యలపై కూడా దృష్టి పెట్టి, వైద్య సేవలు కొనసాగించాలని పల్మనాలజిస్టులకు తెలంగాణలోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి సూచించారు. ఏపీ స్టేట్ పల్మనాలజిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యాన జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న ఏపీఎస్‌ఏసీఓఎన్–2023 సదస్సును రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, క్షయ, ఎయిడ్స్ వంటి వ్యాధులు వేగంగా వ్యాపించినప్పుడు, కరోనా వ్యాప్తి సమయంలోను అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో పల్మనాలజిస్టులు ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమై అందించిన వైద్య సేవలు అనిర్వచనీయమైనవని తెలిపారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, కోవిడ్ సమయంలోను, అనంతరం పల్మనాలజిస్టులు అందిస్తున్న వైద్య సేవలు నిరుపమానమైనవని వివరించారు. వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు నాటి, వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని వైద్య విద్యార్థులకు సూచించారు. ఇదే స్ఫూర్తితో రాజకీయాల్లో పేరుకుపోతున్న కాలుష్యాన్ని నివారించడానికి యువతతో పాటు వృత్తి నిపుణులు కూడా ముందుకు రావాలని కోరారు. సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గూడూరి శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకుని, రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో పల్మనాలజిస్టులు చూపిన శ్రద్ధ అభినందనీయమని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న నేపథ్యంలో సామాన్యులపై ఆర్థిక భారం పడని విధంగా నూతనావిష్కరణలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రకుమార్, కార్యదర్శి డాక్టర్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురి అరెస్టు

రంగంపేట: గంజాయి తరలిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. గంజాయి అక్రమ రవాణాపై పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ ఆదేశాల మేరకు.. అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ ఆధ్వర్యాన రంగంపేట – వడిశలేరు గ్రామాల మధ్య ఏడీబీ రోడ్డులో ముకుందవరం వెళ్లే దారిలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పెద్దాపురం వైపు నుంచి రాజానగరం వైపు వెళ్తున్న ఆటోలో 23.100 కిలోల గంజాయి పట్టుబడింది. దీనిని తరలిస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన మీసాల మదన్‌కుమార్, మీసాల లక్ష్మణ సాయి, కొంచాడ భానుతేజ, బండి పృథ్వీరాజ్, మందాల ప్రవీణ్‌కుమార్, నల్ల సాయిలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో మదన్‌కుమార్‌పై గతంలో రాజమహేంద్రవరంలోని పోలీస్ స్టేషన్లలో పలు కేసులున్నాయి. గంజాయి అక్రమ రవాణా కేసులో గతంలో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. మరో నిందితుడు లక్ష్మణసాయిపై నాలుగు చోరీ కేసులు, ఒక కొట్లాట కేసు ఉన్నాయి. భానుతేజపై కూడా గంజాయి కేసు ఉంది.

వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం

పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం కాతేరులోని వైభవ్ ఫంక్షన్ హాల్లో, రూరల్ పార్టీ కార్యాలయంలో మండల, గ్రామ సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో, వాటికి కావాల్సిన ధ్రువపత్రాలను ఉచితంగా అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం దేశ చరిత్రలోనే సేవల విషయంలో చరిత్ర సృష్టించిందని తెలిపారు. అత్యధిక సేవలు అందించి రాష్ట్రంలోనే రూరల్ నియోజకవర్గం మూడో స్థానంలో నిలిచిందని అన్నారు. అత్యధిక సేవలు అందిచడంలో కృషి చేసిన సచివాలయ కన్వీనర్లను అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని నాగేశ్వర్ సూచించారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం


ఎస్‌కేఆర్‌లో ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి అధ్యక్షతన జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. లైబ్రేరియన్ పీపీ ప్రియరంజని, లైబ్రేరియన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, సభ్యులు కేఏస్ అన్నపూర్ణాదేవి, ఎస్.స్వాతి పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ఇంటర్ బోర్డు ఆర్ఐవో కేవీఎల్ఎస్ఎస్ నరసింహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్ఐవో మాట్లాడుతూ పూర్వం, ప్రస్తుత పాఠ్య పుస్తకాలకు తేడా ఎలా ఉందీ, పుస్తక పఠనం ప్రాధాన్యతను వివరించారు. గ్రంథాలయ అధికారులు సీహెచ్ఎస్ సుధాకర్, జి.వరలక్ష్మి, ఐ.సుబ్రహ్మణ్యం, ఎస్.భరద్వాజ్, ఆదిత్య ఉభయ కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలు జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం పార్లమెంట్‌లో మాట్లాడతా..

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- నన్నయలో ఏపీ ఏఎఎస్ఎల్‌పీఏ సదస్సు ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజానగరం: దివ్యాంగుల కోసం 2016లో రూపొందించిన చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసే విధంగా పార్లమెంట్‌లో మాట్లాడతానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ ఆడియోలజిస్టు అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేథాలజిస్టు అసోసియేషన్ (ఏపీ ఏఎఎస్ఎల్‌పీఏ) ఆధ్వర్యంలో 'రీసెంట్ రీహ్యాబిలిటేషన్ రీసెర్చ్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. యువ ఆడియోలజిస్టులు వైద్య వృత్తితో పాటు సమాజ అవగాహన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలన్నారు. నన్నయ వీసీ ఆచార్య కె. పద్మరాజు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో చిన్నారులు, యువత అధికంగా సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారన్నారు. దీనివల్ల మెదడులోని నరాలు తీవ్ర ఒత్తిడికి గురై అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయన్నారు. అంతేకాకుండా కుటుంబ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు. ఇకనైనా తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచడంలో శ్రద్ధ వహించాలని సూచించారు. ఇండియన్ స్పీచ్ అండ్ హియరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ గోస్వామి మాట్లాడుతూ ఆడియోలజిస్టు అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేథాలజిస్టులుగా విద్యనభ్యసించడానికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 300 మంది వరకూ ఆడియోలజిస్టు అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేథాలజిస్టులు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును సత్యకిశోర్‌కు అందజేశారు. సదస్సు జరిగే ప్రాంతంలో హియరింగ్ మెషీన్లకు సంబంధించిన 14 కంపెనీలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ ప్రకాష్‌బూమినాథన్, డాక్టర్ బి.శివప్రసాద్, ఎంఏ శ్రీకాంత్, డాక్టర్ యుగంధర్ రామకృష్ణ, సాయికోటి, అరివుడై నంబి, ఫణీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం..

జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కొత్త బాలమురళీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న బాల మురళీకృష్ణ తదితరులు

సీటీఆర్ఐ: ప్రపంచ ఆర్యవైశ్యుల మహాసభ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ఆర్య వైశ్యులకు అండగా ఉంటామని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొత్త బాలమురళీకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ అధ్యక్షుడిగా తాను ఎన్నికయ్యామన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కొవ్వూరు పీఆర్ఆర్ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేస్తామన్నారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు వస్తున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు టీజీ వెంకటేష్‌ను రాజమహేంద్రవరం వాసవీమాత ఆలయం వద్ద నుంచి భారీ ఊరేగింపుగా కొవ్వూరు సభా వేదిక వద్దకు తీసుకు వెళతామన్నారు. ఆర్యవైశ్యులు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారిలో రాజకీయ చైతన్యం తేవడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ద్వారా కృషి చేస్తామన్నారు. 43 దేశాల్లో ఆర్యవైశ్య మహాసభ సేవలందిస్తోందన్నారు. ఆర్యవైశ్యులను సంఘటితం చేసి ఏకతాటిపైకి తేవడంతో పాటు విద్యలో ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ సభలో వంద మంది పేద ఆర్యవైశ్య కుటుంబాలకు వెట్ గ్రైండర్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యక్కల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నాళం వీరవెంకట శ్రీనివాసరావు, చీఫ్ కోఆర్డినేటర్ వజ్రపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు


మొహమ్మద్ ఆరిఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మసీదు నిర్వాహకులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు మొహమ్మద్ ఆరిఫ్ హెచ్చరించారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.15 వేల గౌరవ వేతనాన్ని అందుకుంటూ ఇమామ్, మౌజన్లను నియమించకుండా మసీదులను నిర్వహిస్తున్న కమిటీలపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వక్ఫ్ బోర్డ్ అధికారులతో కలసి జిల్లా కమిటీ తనిఖీలు చేయగా పలుచోట్ల అవకతవకలు బయట పడ్డాయని, వారికిచ్చిన నిర్ణీత గడువులోగా సదరు కమిటీలు ఖర్చుల వివరాలను అధికారులకు సమర్పించాలన్నారు. లేనిపక్షంలో సదరు మసీదులను వక్ఫ్ బోర్డ్ జిల్లా యంత్రాంగం స్వాధీన పరుచుకుని వారి కమిటీలను రద్దు చేసి నూతన కమిటీలను నియమిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో దుల్హన్ పథకం కింద కేవలం రూ.50 వేలు ఇచ్చేవారని, చంద్రబాబు అధికారం కోల్పోయే నాటికి వేల సంఖ్యలో దుల్హన్ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక పేద ఆడపిల్లల తల్లిదండ్రులకు మరింత చేయూతనిస్తూ ఆ మొత్తాన్ని రెట్టింపు చేసి రూ.లక్ష ప్రకటించారన్నారు. ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే ఆ సొమ్ము అందుతుండటంతో దాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసంబద్ధమైన ఆరోపణలు చేస్తున్నాయన్నారు.

15న దుకాణాలకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 15న షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం చాంబర్ పరిధిలో దుకాణాల సెలవు పాటించాలని చాంబర్ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ శనివారం ప్రకటించారు. దీనిని చాంబర్ సభ్యులు విధిగా పాటించాలని కోరారు.

అవయవదానానికి అంగీకారం

సీటీఆర్ఐ: తన మరణానంతరం శరీరం వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలకు అవయవదానం చేయనున్నట్లు శ్రీవీరేశలింగం పురమందిరం అధ్యక్షుడు జగన్నాథం వెంకటరెడ్డి (బుట్టల రెడ్డి) తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరణించిన తరువాత ఆ శరీరం ఏదో విధంగా కొందరికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. తన కుటుంబ సభ్యులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఆధ్యాత్మికంగా, సామాజికంగా తాను, కుటుంబ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

కడియం: మండలంలోని ఆర్బీకేలు, సహకార సొసైటీల్లో పూర్తి స్థాయిలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. 14.35.14, యూరియా, డీఏపీ, 10.26.0 రకాల ఎరువులు రైతులకు అందిస్తున్నామన్నారు. కావాల్సిన రైతులు సంబంధిత ఆర్బీకేలు, సహకార సొసైటీల్లో సంప్రదించాలని అన్నారు.

టీడీపీ ప్రచారం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగర పాలక సంస్థ పరిధి 17వ డివిజన్‌లో ఇన్‌చార్జి రొంపిచర్ల ఆంటోనీ ఆధ్వర్యంలో శనివారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో నేతలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పిల్లా తనూజ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల: జైలర్
సూర్యమినీ: గదర్–2
సూర్యప్యాలెస్, స్వామి, శివజ్యోతి, రంభ,
రాజా: భోళాశంకర్
అనుశ్రీ: బ్రో
అశోక: జైలర్
ఊర్వశి: ఉస్తాద్
మేనక: జైలర్
అప్సర: బేబి
నామవరం:
వీఎస్ మహల్: భోళాశంకర్
ధవళేశ్వరం:
మురళీకృష్ణ: భోళాశంకర్
కడియం:
వెంకటసూర్య: భోళాశంకర్